ఈ వారం కథ

# వేట

## ఎస్. శివనాగేశ్వరరావు

"మే ఐ కమిన్ సర్" శృతి తలుపు కొద్దిగా తెరిచి ప్రవేశానికి అనుమతి కోరింది. "ఎస్, కమిన్!" అన్నాడు శ్రీనాథ్.

లోనికి ప్రవేశించిన శృతి "గుడ్‌మాణింగ్ సర్!" అంది. 'వెరీ గుడ్‌మార్నింగ్. ప్లీజ్ బి సీటెడ్' అని చెయిర్ ఆఫర్ చేశాడు శ్రీనాథ్. 'థేంక్యూ' అని కుర్చీలో ఒద్దికగా కూర్చుంది శృతి.

ఇంటర్వ్యూ బోర్డులో కనీసం ఇద్దరు, ముగ్గురు మెంబర్స్ వుంటారని ఊహించింది శృతి. అయితే అక్కడ ఒక్కరే వుండడం చూసి కొద్దిగా ఊపిరి పీల్చుకుంది. ఎందుకంటే ప్రశ్నల వర్షం ఉధృతం అంతగా వుండదని.

శ్రీనాథ్ తన ఎదురుగా వున్న శృతివంక పరిశీలనగా చూశాడు. బయోడేటా ప్రకారం ఆమె వయసు ఇరవైమూడు. తేనెరంగు కళ్ళు.. సన్నటి నాసిక.. ఎర్రటి పెదవులు.. దానిమ్మ గింజల్లాంటి ఫలువరున.. బంగారు మేనిఛాయ. అంత సన్నమూ కాదు.. లావూ కాదు. నీలం రంగు వూలు ప్రింట్ చేయబడిన తెల్లచీర కట్టుకుంది. నీలం బోర్డర్ వున్న జాకెట్ వేసుకుంది. జాకెట్‌లోంచి లీలగా బ్రా కనిపిస్తున్నది. ఉన్నతమైన వక్షద్వయం పైటచాటునుంచి తమ ఉనికిని గర్వంగా చాటుతున్నాయి. మెడలోని ఒంటిపేట బంగారు గొలుసు ఆమె మేనిఛాయలో కలిసిపోయింది. ఎడమచేతికి రిస్ట్‌వాచ్.. కుడిచేతికి రెండు నీలం రంగు మట్టిగాజులు.. శ్రీనాథ్ ఆమెను అందగత్తె క్రింద ట్రీట్‌చేసి మనసులో ఫిగర్‌కి వందకు డెబ్బై అయిదు మార్కులు వేయవచ్చు అనుకున్నాడు. అతని పెదవులమీద లీలగా చిరునవ్వు మెదిలింది.

ఆమెలో అతన్ని బాగా ఆకట్టుకుంది- ఆమె పెదవి క్రింద పెసరబద్దంత పుట్టుమచ్చ. తేనెరంగు కళ్ళు- పెదవి క్రింద పుట్టుమచ్చ సూపర్ కాంబినేషన్ అనుకున్నాడు శ్రీనాథ్.

అతను తనను శ్రద్ధగా పరిశీలించడం గమనించి, శృతి చెయిర్‌లో ఇబ్బందిగా కదిలింది. శ్రీనాథ్ ఆమె అందాన్ని పరిశీలించడం ఆపి "మేడం! యూనివర్సిటీవారు మీకిచ్చిన మార్క్స్ చూశాను. మీరు బ్రిలియెంటని తెలుస్తూనే వుంది. ఇంక మిమ్మల్ని వేరే ప్రశ్నలు అడిగి ఇబ్బందిపెట్టడం నా అభిమతం కాదు. అది నా పాలసీకే విరుద్ధం" అన్నాడు.

"థేంక్యూ" అంది శృతి. 'స్వరం మధురం!' అనుకున్నాడు శ్రీనాథ్ మనసులో.

"సీ... మిస్ శృతీ! ఈ ఉద్యోగం మీరు టైంపాస్‌కి చేయబోతున్నారా? లేక కుటుంబ పోషణ కొరకా?" అని ప్రశ్నించాడు శ్రీనాథ్. "కుటుంబ పోషణ కోసమే సర్! నిజానికి ఉద్యోగం చేయడం నాకు చాలా అవసరం. నాన్నగారు యాక్సిడెంట్‌లో చనిపోయారు. ఆ షాక్‌తో అమ్మ కోమాలో వుంది. నాన్నగారి ప్రావిడెంట్ ఫండ్ డబ్బు రావడానికి టైమ్ పడుతుందట. దయచేసి ఈ ఉద్యోగం నాకు వచ్చేలా చూడండి సర్!" అంది శృతి అర్థింపుగా.

"ష్యూర్! ఈ స్టెనో కమ్ పి.ఎ. పోస్ట్ మీకు కన్‌ఫర్మ్ చేస్తాను. అయితే ముందు మరో చిన్న ఫార్మాలిటీ కంప్లీట్ చేయాలి" అన్నాడు శ్రీనాథ్. "ఏమిటి సర్ అది?" అని ప్రశ్నించింది శృతి.

"వెరీ సింపుల్.. ఈ రాత్రికి నీ అందంతో నాకు విందుచేయాలి. అంతేకాదు... అప్పుడప్పుడు ఇలాంటి విందు భోజనాలు తప్పవు. నీవు యస్సంటే.. ఈ ఉద్యోగం నీకే!" అన్నాడు శ్రీనాథ్.

ఆ మాటకు శృతి ఉలిక్కిపడింది. ఒక్క క్షణం ఎదురుగా వున్న అధికారి అంటున్న మాటలు ఆమెకు అర్థంకాలేదు. అర్థమయ్యాక... 'సరే" అంది.

శ్రీనాథ్ నవ్వి "ఉద్యోగం కావాలంటే ఈమాత్రం త్యాగాలు తప్పవు" అన్నాడు.

శృతి చెయిర్‌లోంచి పైకి లేచింది బయలుదేరడానికి సిద్ధమవుతూ.

"చూడండి మేడం! ఈ విషయం మీరెవరికైనా కంప్లయింట్ చేసినా ఉపయోగం వుండదు. పైపెచ్చు మీకే పరువునష్టం. ఉద్రేకపడకుండా.. ఒక్క క్షణం ప్రశాంతంగా ఆలోచించండి. ఈ ఉద్యోగం వలన మీకందే జీతం మూడువేలు. ఈ జీతానికి ఆశపడి మీరు కాకపోతే... మరే అమ్మాయి అయినా నా ప్రపోజల్‌కి తప్పక ఒప్పుకుంటుంది. మరి ఈ అవకాశం మీరెందుకు వదులుకోవాలి. ఈ విషయం మన మధ్యనే వుంటుంది" అన్నాడు శ్రీనాథ్.

శృతి ఒక్క క్షణం ఆలోచించింది- నిర్ణయం తీసుకోవడానికి. "సర్! విందు పూర్తయ్యాక మీరు ఉద్యోగం ఇస్తారని గ్యారంటీ ఏమిటి?" అంది. శ్రీనాథ్ నవ్వి "నేను ఫ్రాంక్‌గా మాట్లాడతానని మీరీపాటికి గ్రహించి వుండాలి. కావాలన్నది అడిగి తీసుకోవడమే గాని.. చీటింగ్ నా పాలసీ కాదు. ఎనీహౌ అనుమానించావు కాబట్టి చెబుతున్నాను. నీవు నా ప్రపోజల్‌కి సమ్మతిస్తే

"ఓకే సర్! మీ ప్రపోజల్‌కి ఒప్పుకుంటున్నాను" అంది శృతి. "గుడ్..!" అని శ్రీనాథ్ కాలింగ్ బెల్ ప్రెస్‌చేశాడు. ప్యూన్ వచ్చాడు. టైపిస్ట్‌ని పిలిపించి అపాయింట్‌మెంట్ ఆర్డర్ టైప్‌చేసి తీసుకురమ్మని వివరాలు చెప్పాడు.


తరువాత శృతితో "అపాయింట్‌మెంట్ ఇచ్చాక నీవు హేండిస్తే ఏం చేయాలి?" అన్నాడు. "ఇది మీకు రావలసిన అనుమానం కాదు. అపాయింట్ చేసినవారికి డిస్మిస్ చేసే అధికారమూ వుంటుందని తెలుసు. అయినా నేను చీటర్ని కాదు. ఒకసారి ఒప్పుకున్నాక మీ అంతట మీరు డ్రాప్ కావలసిందేగాని.. నేను డ్రాప్ కాను!" అంది.

"నీవు నాకు నచ్చావు" అన్నాడు శ్రీనాథ్. "అప్పుడే?" అంది శృతి.

"ఐటమ్ చూడగానే... దాని టేస్ట్ ఎలా వుంటుందో చెప్పగలను" అన్నాడు శ్రీనాథ్ గర్వంగా.

"కొన్ని ఐటమ్స్.. చూడ్డానికి మామూలుగా వుంటాయి. తినబోయేసరికి ఘాటుతో గూబ గుయ్‌మనిపిస్తాయి."

"నిన్ను చూసి రిజర్వ్‌డ్ టైప్ అనుకున్నాను. కానీ జాలీ టైపే!" అన్నాడు



ఇప్పుడే అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇస్తాను" అన్నాడు.

శృతి ఆలోచించింది. తండ్రి మరణం... తల్లి కోమాలో వుండడం జ్ఞాపకానికి వచ్చింది. తండ్రిని పోగొట్టుకుంది. కనీసం తల్లినయినా దక్కించుకోవాలని నిశ్చయించుకుంది.

"నిజానికి మొదటిదే కరెక్ట్. కానీ ఎప్పుడూ అందరి దగ్గరా అలా వుండలేం కదా!" అంది శృతి.

"గుడ్" అని ఆమె బుగ్గమీద చిటిక వేశాడు శ్రీనాథ్.

టైపిస్ట్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ టైప్‌చేసి తెచ్చాడు. శ్రీనాథ్ అందుకుని సంతకంచేసి "ఆల్ ద బెస్ట్!" అని శృతికి అందించాడు. "థేంక్స్" అని

అందుకుంది శృతి.

టైపిస్ట్ వెళ్ళిన తరువాత "రాత్రికి ఎక్కడికి రావాలి? ఏదైనా హోటలా? లేక మీ ఫ్రెండ్ ఇల్లా?" అని అడిగింది శృతి. అందుకు శ్రీనాథ్ "దొంగదారులు నాకిష్టముండదు. ఏది చేసినా అఫిషియల్‌గా చేస్తాను. అది నా పాలసీ! నీవు మా ఇంటిదగ్గర కలువు" అని విజిటింగ్ కార్డ్ అందించాడు.

శృతి, శ్రీనాథ్ వంక ఒక్కసారి చూసి అతని వయసు అంచనావేసింది. 30–35 మధ్య వుంటుంది. తప్పకుండా పెళ్ళయి వుండాలి. "ఇంటికి రమ్మంటున్నారు. మీ శ్రీమతి లేదా?" అని ప్రశ్నించింది.

"ఉంది. అయినా తనేం మాట్లాడదు. పెళ్ళాన్ని చెప్పకింద తేలులా వుంచడం నా పాలసీ. తన గురించి భయపడకు. సరిగ్గా 9 గంటలకు వచ్చేయి" అన్నాడు శ్రీనాథ్.

"ష్యూర్!" అంది శృతి పైకిలేస్తూ. "ఈలోగా శాంపిల్‌గా ఒక తీయని ముద్దు ఇవ్వకూడదూ...?" అన్నాడు శ్రీనాథ్ గోముగా.

"నథింగ్ డూయింగ్! ముందే టేస్ట్ చూస్తే విందులో మజా వుండదు" అంది శృతి.

"యూ ఆర్ రైట్! నీకోసం వేయి కన్నులతో ఎదురుచూస్తుంటాను" అన్నాడు శ్రీనాథ్.

"బై!" అని బయటకు నడిచింది శృతి.

తన క్లాస్‌మేట్ సిస్టర్.. కాత్యాయని అదే ఆఫీస్‌లో పనిచేస్తున్నట్టు శృతికి తెలుసు. ఆమె గురించి ఎంక్వయిరీ చేసి ఆ సెక్షన్‌కి వెళ్ళి కలిసింది.

శృతి అపాయింట్‌మెంట్ గురించి తెలుసుకున్న కాత్యాయని "అంత తేలికగా అపాయింట్‌మెంట్ ఇవ్వడే ఆ రాస్కెల్!" అంది. శృతి జరిగింది చెప్పింది. "నాకు తెలుసు శృతీ! వాడు కామాంధుడు. ఆడపిల్ల శీలాన్ని ఉద్యోగానికి ముడిపెట్టి వారి అవసరాన్ని తన సుఖంగా మార్చుకునే శాడిస్ట్!" అంది కసిగా.

"అంటే.. మీరు.." అని ఆగిపోయింది శృతి. "నేనూ అవసరానికి వాడికి శీలాన్ని సమర్పించుకున్నాను" అంది కాత్యాయని.

"ఇంటికి రమ్మన్నాడు. మరి అతని శ్రీమతి ఏం అనదా?" అంది శృతి. "పశువుతో పసుపుకొమ్ము కట్టించుకున్న పాపానికి... మౌనంగా భరిస్తున్నది" అంది కాత్యాయని.

"పిల్లలు వున్నారా?" అని అడిగింది శృతి. "ఒక పాప" అని బదులిచ్చింది కాత్యాయని. "థేంక్స్.. వస్తాను" అని కదిలింది శృతి. వెళ్తున్న శృతివంక జాలిగా చూసింది కాత్యాయని.

ఆ రాత్రి ఖచ్చితంగా తొమ్మిది గంటలకు శ్రీనాథ్ ఇంటికి వెళ్ళింది శృతి. కాలింగ్ బెల్ ప్రెస్ చేయగానే శ్రీనాథ్ భార్య వచ్చి తలుపుతీసింది. శృతిని చూడగానే మరేం ప్రశ్నించకుండా లోనికి వెళ్ళిపోయింది.

శ్రీనాథ్ అప్పటికి భోజనం పూర్తిచేసి సిద్ధంగా వున్నాడు. శృతిని చూడగానే అతని కళ్ళు మెరిశాయి. తెల్లచీరె.. తెల్ల జాకెట్.. తలలో సన్నజాజులు.. అచ్చం శోభనం పెళ్ళికూతురిలా వుంది. అతను 'కమాన్!' అని శృతితో బెడ్‌రూమ్‌వైపు వెళ్తుండగా "డాడీ!" అన్న పిలుపు వినిపించింది.

శ్రీనాథ్ క్షణమాగి "వాట్ బేబీ!" అని అడిగాడు. ఆ పాపకు అయిదేళ్లు వుంటాయి. "ఎవరా పాప?" అని అడిగింది శృతి. "నా డాటర్. పేరు మీనా" అన్నాడు శ్రీనాథ్.

"డాడీ! నాకు ఐస్‌క్రీమ్ కావాలి!" అంది పాప ముద్దుగా. "రేపు తెస్తాను. వెళ్ళి మమ్మీ దగ్గర పడుకో!" అని శృతితో బెడ్‌రూమ్ చేరాడు శ్రీనాథ్.

ఇల్లంతా నీట్‌గా వుంది గాని బెడ్‌రూమ్ మాత్రం అస్తవ్యస్తంగా వుంది. బహుశా అతని శ్రీమతి ఆ గది జోలికి రాకపోవడం వలననే అలా వుందని భావించింది శృతి. డ్రెస్సింగ్ టేబుల్‌మీద రెండు సెక్స్ బుక్స్.. సగం ఖాళీచేసిన విస్కీ బాటిల్.. సిగరెట్ ప్యాకెట్ వున్నాయి. గోడమీద నగ్నంగా వున్న విదేశీ యువతి క్యాలెండర్ వుంది. అతని చవుకబారు టేస్ట్ అర్థమయింది శృతికి.

"యూ ఆర్ సో బ్యూటిఫుల్!" అని ఆమెను కౌగలించుకోబోయాడు శ్రీనాథ్.



"అంత తొందరెందుకు?" అని అతనికి దూరంగా జరిగింది శృతి.

"మందు.. నీలాంటి దాని పొందు ఒకేసారి అయితే బావుంటాయి. ఆలస్యం చేస్తే ఎక్కిన కిక్ దిగిపోగలదు" అన్నాడు శ్రీనాథ్. "మందుని మించిన కిక్ నేనిస్తాను" అంది శృతి.

"నిన్ను చూడగానే కిక్కెక్కింది. అందుకే నా లైఫ్‌లో ఫస్ట్‌టైమ్... అనుభ వించకుండా అపాయింట్‌మెంటిచ్చాను" అన్నాడు శ్రీనాథ్. అతనినోటినుంచి ఆల్కహాల్ వాసన గుప్పుమంటున్నది.

గోడమీది కేలండర్ చూపించి "నిన్నలా చూడాలని వుంది" అన్నాడు.

శృతి తీయగా నవ్వింది. "మనిద్దరిమధ్య ఇటువంటి అడ్డు నాకిష్టముం డదు" అని ఆమె పైట లాగబోయాడు శ్రీనాథ్. శృతి అతన్ని వారించి బెడ్‌వైపు నడిచింది. శ్రీనాథ్ ఆమెను అనుసరించాడు.

శృతి బెడ్‌మీద కూర్చుని "నా కళ్లు బాగున్నాయా?" అని అడిగింది.

"చాలా బాగున్నాయి. తేనెరంగు కళ్ళంటే నాకు చాలా ఇష్టం" అని ఆమె కళ్ళలోకి లోతుగా చూశాడు శ్రీనాథ్. క్షణంలో అతనికి మత్తెక్కింది.

* * *

పదిహేనేళ్ళు గడిచాయి. శ్రీనాథ్ ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్న సంగతి తెలిసి మేనేజ్‌మెంట్ అతన్ని డిస్మిస్ చేసింది. అంతవరకు విలాస వంతమైన జీవితం గడిపిన శ్రీనాథ్‌కి డబ్బుకు కటకట అయింది. చేతిలోని డబ్బు నెమ్మదిగా హరించుకుపోయింది. తిండికి కూడా గడవని పరిస్థితి ఏర్పడింది.

అప్పటికి... అతని కూతురు మీనాకు డిగ్రీ పూర్తయింది. కుటుంబ పరిస్థితి ఎరిగిన మీనా ఉద్యోగ ప్రయత్నం చేసింది. తొలిసారిగా ఇంటర్వ్యూకెళ్ళింది.

ఇంటర్వ్యూ చేస్తున్న అధికారి "మిస్ మీనా! నీకీ ఉద్యోగం ఎంత అవసరమో చెప్పావు. ఉద్యోగం నీకే ఇస్తాను. అయితే అందుకు ముందుగా నీవో ఫార్మాలిటీ పూర్తిచేయాలి" అన్నాడు.

"ఏమిటి సర్!" అడిగింది మీనా.

"ఈ రాత్రికి నీ అందాన్ని నాకు విందు చేయాలి. అంతేకాదు.. అప్పుడప్పుడు కూడా ఇటువంటి విందులు తప్పవు" అన్నాడు. 'సర్...' అంది మీనా భయంగా.

"ఇష్టం లేకపోతే బలవంతం లేదు. ఇష్టపడిన అమ్మాయికే ఉద్యోగమిస్తాను" అన్నాడు అధికారి.

తండ్రి దుర్భర పరిస్థితి... తల్లి అనారోగ్యం... మీనా మరిక ఆలోచించలేక పోయింది. "మీ ఇష్టం సర్!" అంది చిన్నగా.

"థేంక్స్.. ఈరోజు రాత్రి సరిగ్గా 9 గంటలకు" అన్నాడు అధికారి.

జరిగిన ఘోరం తెలిసి శ్రీనాథ్ మండిపడ్డాడు. ఆవేశంతో ఊగిపోయాడు. ఆ అధికారి ప్రాణం తీస్తానని రెచ్చిపోయాడు. "అతవేం తప్పు చేశాడు? ఇన్నాళ్లూ మీరు చేసిన పనే చేశాడు" అంది శ్రీనాథ్ భార్య కూల్‌గా.

ఆ మాటకు శ్రీనాథ్ కుప్పకూలిపోయాడు. పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. "భగవాన్! నన్ను క్షమించు" అని బిగ్గరగా రోదించసాగాడు.

* * *

"నెమ్మదిగా కళ్లు తెరుస్తున్నారు... మెల్లమెల్లగా నన్ను చూస్తున్నారు. ట్రాన్స్‌లోంచి బయటకు వస్తున్నారు.. వస్తున్నారు" అంటూ శృతి శ్రీనాథ్‌ని ట్రాన్స్‌లోంచి బయటకు తెచ్చింది.

శ్రీనాథ్ బాహ్యస్మృతికి రావడానికి అయిదు నిమిషాలు పట్టింది. అతను తన బెడ్ రూమ్ వంక... శృతివంక అయోమయంగా చూసి, ఒక్కుదుటున బెడ్ దిగి డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళి అద్దంలో తన ముఖం చూసుకున్నాడు.


శృతి నవ్వుతూ "భయపడకండి. మీ ఉద్యోగం పోలేదు. మీరు ముసలివారైపోలేదు. మీ పాప శీలం పోలేదు. జస్ట్ నేను మిమ్మల్ని హిప్నటైజ్ చేశాను" అంది.


శ్రీనాథ్ అక్కడున్న చెయిర్‌లో కూలబడి కణతలు నొక్కుకుంటూ "సారీ!" అన్నాడు. "చూడండి శ్రీనాథ్‌గారూ! వేట... వేటగాడికి వినోదంగానే వుంటుంది. కానీ బలయ్యే జీవులకు ప్రాణసంకటంగా వుంటుంది. అయితే, అలాంటి క్రూరమైన వేటగాడు తనకు ప్రాణప్రదమైన దానికి ప్రమాదం సంభవిస్తే తల్లడిల్లిపోతాడు. ఆ బాధ ఎలాంటిదో వేటగాడికీ తెలియజెప్పాలనే మిమ్మల్ని హిప్నటైజ్ చేశాను" అంది శృతి.

"మీరు చెప్పింది నిజం. మీరు తెలియపరచకపోతే నా తప్పు నాకు ఎప్పటికీ తెలిసేది కాదు. నా పాపాలు నా బిడ్డను తప్పక వేటాడేవి. థేంక్యూ వెరీమచ్" అన్నాడు శ్రీనాథ్.

"మీలోని పశ్చాత్తాపం శాశ్వతం కావాలి. గుడ్‌నైట్" అని బయటకు కదిలింది శృతి.

శ్రీనాథ్‌లోని వేటగాడు హతమయ్యాడు. అతనిలోని వాల్మీకి బయటకు వచ్చాడు. ఇక అందరూ అతనికి సీతమ్మలే! ●





DAP బ్రాహ్మీవిట


గ్రాన్యూల్స్

శంఖపుష్పి బ్రాహ్మిల మిశ్రమం

- బ్రాహ్మీ వీటూ చాతుర్యం
- చదివిన ఉండును జ్ఞాపకం
- చేయును పరీక్ష ఉత్తీర్ణం

జ్ఞాపక శక్తిని పెంచి మానసిక వికాసాన్ని కల్గిస్తుంది

Available in all Medical Shops




DECCAN AYURVEDASHRAM PHARMACY LTD.
Saidabad, Hyderabad-500 059, A.P.